నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, శనివారం 6 జూలై 2024 | NALGONDA

నల్లగొండ జడ్పీ సమావేశ మందిరంలో మాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న జడ్పీ ఉద్యోగులు

అధికారం శాశ్వతం కాదు.. ప్రజలకు ఎంత సేవ చేశామన్నదే ముఖ్యం

- జడ్పీలో బండ నరేందర్‌రెడ్డికి ఘన సన్మానం

నల్లగొండ, జూలై 5 : జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా బండ నరేందర్ రెడ్డి ఐదు సంవత్సరాల పదవీ కాలం ముగిసిన సందర్భంగా శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. నరేందర్‌రెడ్డికి జడ్పీ ఉద్యోగులు శాఖల వారీగా ఘనంగా సన్మానించి ఐదేండ్లు తమతో స్నేహపూర్వకంగా ఉన్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బండ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ తనపై నమ్మకంతో జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. జడ్పీ సిబ్బంది, తనకు సహకరించిన జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అధికారాలు శాశ్వతం కాదని, వచ్చిన అవకాశంతో ప్రజలకు ఎంత సేవ చేసి వారి మన్నన పొందామన్నదే ముఖ్యమని అన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పనిని శ్రద్ధతో, సమయ పాలనతో చేస్తే గుర్తింపు దానం దట అదే వస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ ఎన్.ప్రేమ్ కరణ్ రెడ్డి, డిప్యూటీ సీఈఓ బి. శ్రీనివాస్‌రావు, పీఆర్ ఎస్ఈ కె.తిరుపతయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పీడీ టీడబ్ల్యూఓ రాజ్‌కుమార్, పీఆర్ ఈఈ భూమన్న, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎండీ ముజీబుద్దీన్, పీఆర్ ఈఈ నాగయ్య పి.నాగయ్య, ఆయా శాఖల అధికారులు రాంచంద్రారెడ్డి, బాలరాజ్ రెడ్డి, యాకూబ్ నాయక్, ఏపాల సత్యనారాయణ రెడ్డి, కొప్పు రాంబాబు, కె.నరేందర్ రెడ్డి, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, ప్రతీక్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ గోనారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ గోలి అమరేందర్ రెడ్డి, న్యాయవాది గుండె వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు పున్న గణేశ్, అలకుంట్ల మోహన్ బాబు, కో ఆప్షన్ మెంబర్ జామల్ ఖాద్రీ, మాజీ సర్పంచులు బద్దం రాంరెడ్డి, దొండ రమేశ్ పాల్గొన్నారు.

జలశక్తి అభియాన్ పనులు బాగున్నాయ్

- కేంద్ర జల శక్తి కార్యదర్శి వేదవీర్ ఆర్య

నకిరేకల్ : చందుపట్లలో రైతుతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

నల్లగొండ / నకిరేకల్/ నార్కట్‌పల్లి, జూలై 5: జిల్లాలో జలశక్తి అభియాన్ పనులు బాగున్నాయని కేంద్ర జల శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ వేదవీర్ ఆర్య అన్నారు. జిల్లాలో అమలు చేస్తున్న జల శక్తి అభియాన్ పనుల పరిశీలన నిమిత్తం మూడ్రోజుల జిల్లా పర్యటనలో భాగంగా కేంద్ర జల శక్తి అభియాన్ జాయింట్ సెక్రటరీ బృందం శాస్త్రవేత్త దివాకర్ మహంతితో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నారాయణరెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా జల శక్తి అభియాన్ పథకం కింద జిల్లాలో చేపట్టిన పనులను కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర బృందానికి వివరించారు. జిల్లాలో జలశక్తి అభియాన్ పనులను ఇంకా పెద్ద ఎత్తున చేపడుతామని, వంద శాతం పనులను విజయవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా జల శక్తి అభియాన్‌పై డీఆర్డీఏ నాగిరెడ్డి వివరించగా, తాగునీటి అంశాలపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఏఓ శ్రవణ్ కుమార్, ఉద్యాన అంశాలపై జిల్లా హార్టికల్చర్ అధికారి సంగీతలక్ష్మి వివరించారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన వనమహోత్సవంలో బృందం పాల్గొన్నది. అంతకు ముందు నకిరేకల్ మండలం చందుపట్లలో రహదారులకు ఇరువైపులా నాటిన మొక్కలు, నర్సరీ, మ్యాజిక్ సోక్ పిట్లు, కమ్యూనిటీ సోక్ పిట్లు, ఓపెన్ వెల్స్, నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణ వెల్లెంల బృహత్ పల్లె ప్రకృతి వనాలను బృందం పరిశీలించింది. ప్రతి నీటి బొట్టును భూమిలో ఇంకింపజేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల శక్తి అభియాన్ తీసుకు చ్చిందన్నారు. జలశక్తి అభియాన్ కింద దేశ వ్యాప్తంగా 151 జిల్లాలలో పనులు చేపట్టనుండగా నల్లగొండ జిల్లా సైతం ఈ పథకానికి ఎంపికైనట్లు బృందం తెలిపింది. శనివారం దేవరకొండ ప్రాంతంలో నీటి నిల్వ కట్టడాలను పరిశీలించి ప్రత్యేకించి చెక్ డ్యామ్, ఊట కుంటలు, గల్లి కంట్రోల్స్‌ను వాటిని పరిశీలిస్తుంది. అదనపు కలెక్టర్ పూర్ణ చంద్ర, డీఆర్వో రాజ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు

మొబైల్ ద్వారానే ఆర్టీఏ సేవలు

నల్లగొండ సిటీ జూలై 5 : రవాణా శాఖకు సంబంధించిన పలు లైసెన్స్‌లు మొబైల్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని రవాణాశాఖ అధికారి లావణ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెంట్లతో పని లేకుండా 17 రకాల లైసెన్స్‌ల కోసం మొబైల్‌లో బుకింగ్ చేసి తగిన ఫీజు చెల్లించి నేరుగా రవాణా శాఖ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రవాణాశాఖ వెబ్‌సైట్ https//tgtransport.net/tgcfstonline/ వెబ్ సైట్ ద్వారా 17 రకాల సేవలను వినియోగించుకోచ్చని తెలిపారు. ఈ ఆన్‌లైన్ సేవల కోసం T-APP FOlio యాప్‌ను ప్లే స్టోర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

యాదగిరిగుట్ట, జూలై5 : జూలై 21న పౌర్ణమి సందర్భంగా అరుణాచల 'గిరి ప్రదక్షిణ' పాల్గొనే భక్తులకు యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో శుభవార్త తెలిపింది. డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సులను నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. 19న రాత్రి 8 గంటలకు యాదగిరిగుట్టకు నుంచి బయల్దేరి 20న కాణిపాకం దర్శనం చేసుకుంటారని, మధ్యాహ్న భోజనం అనంతరం కాణిపాకం నుంచి బయల్దేరి సాయంత్రం 5 గంటలకు శ్రీపురం గోల్డెన్ టెంపుల్ దర్శనం, 21న గిరి ప్రదర్శన అనంతరం తిరుగు ప్రయాణం ఉంటుందని తెలిపారు.

నిరుద్యోగుల నిర్బంధం

నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్ట్

- ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఉదయం నుంచే బీఆర్ఎస్, విద్యార్థి, యువజన సంఘాల నేతలు..
- నిరుద్యోగులతో నిండిన స్టేషన్లు
- సర్కారు తీరుపై సర్వత్రా ఖండన, తీవ్ర ఆగ్రహం
- అయినప్పటికీ భారీగా తరలివెళ్లిన నిరుద్యోగులు
- కలెక్టరేట్ ముట్టడి నేపథ్యంలో బీజేపీ నేతలూ అదుపులోకి..

సూర్యాపేట, జూలై 5 (నమస్తే తెలంగాణ)/నల్లగొండ

ప్రభుత్వంపై నిరుద్యోగులు రణనినాదం మోగించారు. హామీలు ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్‌పై కన్నెర్ర చేశారు. ఉద్యోగాల సాధన కోసం నడుంబిగించారు. నిరుద్యోగులపై ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ టీజీపీఎస్సీ నిరుద్యోగ మార్చ్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిరుద్యోగులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఎక్కడికక్కడ నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలను అదుపులోకి తీసుకున్నారు. ఉదయం నుంచే నేతల ఇండ్లలోకి వెళ్లి అరెస్ట్ చేశారు. దాంతో నిరుద్యోగులు, బీఆర్ఎస్ నేతలతో పోలీస్ స్టేషన్లు నిండిపోయాయి. మరోవైపు అనేక మంది టీజీపీఎస్సీ ముట్టడికి చాకచక్యంగా తరలివెళ్లారు. ముందస్తు అరెస్ట్‌లతో సర్కారు తీరుపై అన్ని వర్గాలు ఖండించడంతోపాటు సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది.

సూర్యాపేట రూరల్ : విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు నిరుద్యోగులకు అనేక హామీలను ప్రకటించింది. తొలి సంవత్సరంలోనే రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్ ప్రకటన, నిరుద్యోగ భృతి తదితర హామీలు పత్తాలేకుండా పోయాయి. గత ప్రభుత్వం ఇచ్చిన 30వేల ఉద్యోగాలకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చి సొంత డబ్బా కొట్టుకోవడం తప్ప ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కారు నిరుద్యోగులకు చేసిందేమీలేదు. అధికారంలోకి వచ్చి ఏడు నెలలుగా దాటినా కనీసం పట్టించుకోపోవడంపై నిరుద్యోగులు ఉద్యమ బాట పట్టారు. ఇప్పటికే మోతీలాల్ నాయక్ చేసిన నిరాహార దీక్షతో బయటకు వచ్చిన నిరుద్యోగులు బక్క జడ్సన్, అశోక్ సర్‌ల నిరాహార దీక్షతో రగిలిపోయారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పెద్దఎత్తున తరలివెళ్లేందుకు నిరుద్యోగులు ప్లాన్ చేశారు. ముట్టడిని ఎలాగైనా భగ్నం చేయాలని భావించిన ప్రభుత్వం..పోలీసులతో ముందస్తు అరెస్ట్‌లు చేయించింది. శుక్రవారం ఉదయం నుంచే నిరుద్యోగులతోపాటు బీఆర్ఎస్ నాయకులు, వివిధ విద్యార్థి, యువజన సంఘాల నేతల ఇంటికెళ్లి అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు. నిరుద్యోగులను అణచివేసే ప్రయత్నం చేయడాన్ని పోలీస్ స్టేషన్‌లో ఉన్న పలువురు విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు నిరుద్యోగ సమస్యలపై బీజేపీ, బీజేవైఎం కలెక్టరేట్ ముట్టడికి పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసులు బీజేపీ, బీజేవైఎం నేతలను ముందస్తు అరెస్ట్ చేశారు. అయినా ధర్నా చేసి ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

కొండమల్లేపల్లిలో విద్యార్థి నాయకుల ముందస్తు అరెస్ట్

సంస్థాన్ నారాయణపురం : బీఆర్ఎస్వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు

తిరుమలగిరిలో బీఆర్ఎస్ నాయకులను అరెస్ట్ చేసిన పోలీసులు

మాసాయిపేట వాసికి అమెరికా ప్రభుత్వ ఆహ్వానం

వెంకటేశం

యాదగిరిగుట్ట, జూలై5 : వాతావరణ శాస్త్రవేత్త హోదాలో మాసాయిపేట గ్రామానికి చెందిన వెంకటేశం ముదిరాజ్‌ను అమెరికా ప్రభుత్వం ఆహ్వానం పంపింది. క్లైమేట్ క్రైసెస్ ఫర్ వెదర్ ఇన్‌ఫ్లూయెన్సర్స్ ప్రాజెక్టులో పార్టిసిస్పెంట్‌గా తెలంగాణ రాష్ట్రం నుంచి సీనియర్ జర్నలిస్ట్, వెదర్ సైంటిస్ట్ వాకిటి వెంకటేశం ముదిరాజ్ ఎంపిక య్యారు. ఈ నెల 6నుంచి 27వరకు అమెరికాలోని వాషింగ్టన్ డీసీ, ఓక్లహామ్, కొలరాడో, ఫ్లోరిడా ప్రాంతాల్లో పర్యటించి, వాతావరణంపై అధ్యయనం చేయనున్నారు. ఈ అధ్యయన నివేదికను అమెరికా ప్రభుత్వానికి అప్పగించి, సుమారు నెల రోజుల అనంతరం తిరిగి భారతదేశానికి తిరిగిరానున్నారు. ఈయన గతంలో గూగుల్ న్యూస్ ఇన్సియేటివ్ ప్రాజెక్టుతో పాటు వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థల్లో పని చేశారు. ఎంపిక పట్ల మెపా రాష్ట్ర కమిటీ ఆయనకు అభినందనలు తెలిపింది.

జడ్పీ ప్రత్యేకాధికారులుగా కలెక్టర్లు

నల్లగొండ జడ్పీ ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సూర్యాపేటలో బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న అధికారి

నల్లగొండ/సూర్యాపేట, జూలై 5 : జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారులుగా కలెక్టర్లు శుక్రవారం ఆయా కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. జూలై 4తో జిల్లా పరిషత్ పాలక వర్గం పదవీ కాలం ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లను ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నల్లగొండ జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారిగా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, సూర్యాపేట జడ్పీ ప్రత్యేకాధికారిగా తేజస్ నంద్‌లాల్ పవార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి జడ్పీ సీఈఓలు ప్రేమ్ కరణ్ రెడ్డి, అప్పారావు, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, అధికారులు కొప్పు రాంబాబు, నరేందర్ రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్‌కు జెడ్పీ సీఈవో అప్పారావు పుష్పగుచ్ఛంఅందించి శుభాకాంక్షలు తెలిపారు.

పక్కా స్కెచ్‌తో పార్థీ గ్యాంగ్ అరెస్ట్

- పెద్దఅంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద సినీ ఫక్కీలో అదుపులోకి..
- పోలీసులపై కత్తులతో దాడికి యత్నం
- గాల్లోకి కాల్పులు జరిపి ఇద్దరిని పట్టుకున్న పోలీసులు
- గ్యాంగ్‌లోని మిగతా సభ్యుల కోసం గాలింపు
- ఇటీవల హైవేలే లక్ష్యంగా దోపిడీలు, దొంగతనాలకు పాల్పడిన గ్యాంగ్
- నేడు వివరాలు వెల్లడించనున్న ఎస్పీ పవార్?

అంబర్‌పేట వద్ద పోలీసులు పట్టుకున్న పార్థీ గ్యాంగ్ సభ్యులు

పోలీసులు వెంబడించి పట్టుకున్న వ్యాన్

నల్లగొండ ప్రతినిధి, జూలై5(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి లక్ష్యంగా గత రెండు నెలలుగా దోపిడీలు, దొంగతనాలు, హత్యలకు పాల్పడుతున్న పార్థీ గ్యాంగ్ సభ్యులను ఎట్టకేలకు నల్లగొండ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం, దేవలమ్మనాగారంలో దొంగతనాలకు పాల్పడి హైదరాబాద్ వైపునకు వెళ్తున్న పార్థీ గ్యాంగ్‌ను శుక్రవారం తెల్లవారుజామున నల్లగొండ పోలీసులు వెంబడించారు. హైవేపై కొత్తగూడెం వద్ద ఆటో ఎక్కిన ఇద్దరు దొంగలను పోలీసులు ఆ వెనకాలే వెంబడిస్తూ అదునుకోసం వేచి చూశారు. ఇంతలోనే పెద్దఅంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు దాటగానే ఓ మహిళ ఆటో ఆగింది. వెంటనే పోలీసులు ఆటోను చుట్టుముట్టారు. వెంటనే అప్రమత్తమైన దొంగలు కత్తులతో దాడికి యత్నించగా పోలీసులు ఫైరింగ్ ఓపెన్ చేశారు. గాల్లోకి రెండు రౌండ్ల కాల్పులు జరుపుతూ దొంగలను ఆటోలోనే బంధించారు. చేతులను తాళ్లతో కట్టివేసి అదే ఆటోలో విచారణ కోసం నల్లగొండకు తరలించారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న గ్యాంగ్ సభ్యులు పార్థీ గ్యాంగ్‌లోని షిండే ముఠాకు చెందిన వారిగా పోలీసులు చెబుతున్నారు. వీరితోపాటు మరో నలుగురు దొంగలు కూడా ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న దొంగలను విచారించి మిగతా గ్యాంగ్ సభ్యులను కూడా అరెస్టు చేసేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపినట్లు తెలిసింది. నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి పార్థీ గ్యాంగ్ కదలికలపై ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. మొత్తం నాలుగు ప్రత్యేక బృందాలు వారం రోజులుగా ఇదే పనిలో నిమగ్నం కాగా శుక్రవారం గ్యాంగ్‌లోని ఇద్దరు సభ్యుల ఆటకట్టించడంలో పోలీసులు సక్సెస్ అయ్యారు.

ప్రత్యేక బృందాలతో నిఘా.

పెద్దకాపర్తి వద్ద నిద్రిస్తున్న కారులో దొంగతానికి పాల్పడిన సమయంలోనే అప్పటి ఎస్పీ చందనాదీప్తి దీన్ని సీరియస్‌గా తీసుకొని ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. హైవే వెంట ఉన్న సీసీ టీవీ రికార్డింగ్‌లను జల్లెడ పట్టారు. పలు హోటళ్ల వద్ద పార్థీ గ్యాంగ్ సభ్యులకు సంబంధించిన ఆనవాళ్లను గుర్తించారు. సీసీ టీవీ రికార్డింగ్‌ల ప్రకారం మరింత నిఘా పెట్టారు. ఎస్పీ మారి కొత్త ఎస్పీగా శరత్ చంద్ర పవార్ బాధ్యతలు చేపట్టాక దీనిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సీసీఎస్ పోలీసులతోపాటు సివిల్ పోలీసులతో కూడిన నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. నిత్యం హైవేపై అనుమానిత వ్యక్తుల సంచారంపై నిఘా పెట్టడంతో పాటు జరుగుతున్న దొంగతనాలపైనా ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. ఘటనలు జరిగిన అన్ని చోట్లా సీసీ టీవీ రికార్డులను పరిశీలిస్తూ ఓ అంచనాకు వచ్చారు. గ్యాంగ్‌లో ఇద్దరి సభ్యుల సీసీ టీవీల ఫొటోలను సేకరించి వాటి ఆధారంగా వారి కదలికలపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టి అదును కోసం వేచిచూశారు.

హైవేల వెంట పార్థీ గ్యాంగ్ హల్‌చల్

మే నెల ఆరంభం నుంచి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్థీ గ్యాంగ్ అలజడులు మొదలైనట్లు పోలీసులు గుర్తించారు. ముఖ్యంగా హైవేలపై ఆగి ఉన్న వాహనాల్లో లేదంటే హైవే వెంట ఉన్న గ్రామాల్లోని ఇండ్లల్లో ఈ గ్యాంగ్ దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నది. విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై ప్రయాణంలో అలిసిపోయి రహదారి పక్కన వాహనాలు ఆపుకుని నిద్రపోయేవారిని ఈ గ్యాంగ్ టార్గెట్ చేసింది. నిద్రపోయేవారిని లేపి కత్తులు చూపి బెదిరించి దోపిడీకి పాల్పడుతున్నారు. ఇలా వాహనాల్లో నిద్రిస్తున్న వారి వద్ద నుంచి నగలు, నగదు దోచుకుంటూ హల్‌చల్ చేస్తుండడం వాహనదారులు, నల్లగొండ పోలీసులకు కంటి మీద కనుకు లేకుండా చేస్తున్నది. మే 18న ఏపీ నుంచి సరకును హైదరాబాద్‌లో దిగుమతి చేసి తిరిగి వెళ్తున్న క్రమంలో అలసిపోయి కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం వద్ద పార్కింగ్ స్థలంలో ఆపిన మినీ డీసీఎం డ్రైవర్ హత్యకు గురయ్యాడు. దుండగులు అతని కాళ్లను కట్టేసి, గొంతు నులిమి దారుణంగా హత్య చేసి అవతలి వైపు రహదారి పక్కన పడేశారు. మే 19న అదే ప్రాంతంలో ఆగి ఉన్న లారీ నుంచి 250 లీటర్ల డీజిల్‌ను దొంగతనం చేశారు. గత నెల 23న కట్టంగూర్ మండలం అయిటిపాముల వద్ద మరో దొంగతనం చేశారు. 28న నకిరేకల్ పటేల్‌నగర్‌లో ఓ ఇంట్లో 8 తులాల బంగారం ఎత్తుకు పోయారు. గత నెల 9న తెల్లవారుజామున ఏపీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న తూర్పుగోదావరి జిల్లా వాసులు ప్రయాణంలో అలసిపోయి చిట్యాల మండలం పెద్దకాపర్తి వద్ద సర్వీసు రోడ్డు లో కారు ఆపారు. అందులో నిద్రిస్తున్న వారిపై ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి దాడి చేశారు. ప్రయాణికుల దగ్గర ఉన్న సుమారు 10 తులాల బంగారాన్ని అపహరించారు. తాజాగా చౌటుప్పల్ మండలం దండు మల్కాపురం వద్ద హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్తున్న వాహనదారులు అలసిపోయి స్వాతి హోటల్ వద్ద పక్కకు పార్కు చేసి నిద్రపోయారు. ఇదే అదునుగా దోపిడీ దొంగలు కారులో రెండు లక్షల రూపాయలను ఎత్తుకెళ్లారు. ఈ ఘటనతో ఒక్కసారిగా హైవేపై దోపిడీ దొంగల కలకలం రేపింది.

నేడు ఎస్పీ ప్రెస్‌మీట్?

పోలీసులు అదుపులో ఉన్న దొంగల నుంచి మరిన్ని వివరాలు రాబట్టేందుకు ఎస్పీ డైరెక్షన్‌లో ప్రత్యేక బృందం తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. వీరు చెప్తున్న వివరాల ఆధారంగా మిగతా సభ్యుల గాలింపు కోసం ప్రత్యేక బృందాలను ఇప్పటికే రంగంలోకి దింపినట్లు తెలిసింది. శుక్రవారం అదుపులోకి తీసుకున్న ఇద్దరు పార్థీ గ్యాంగ్ దొంగల అరెస్టుకు సంబంధించి శనివారం జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ప్రెస్‌మీట్ పెట్టనున్నట్లు తెలిసింది. గ్యాంగ్‌కు సంబంధించిన పూర్తి వివరాలు, దొంగతనాలు, ఇతర అంశాలను ఎస్పీ వెల్లడించనున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

చౌటుప్పల్ పరిధిలో దొంగతనంతో...

చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారం, కొయ్యలగూడెంలో శుక్రవారం తెల్లవారుజామున పార్థీ గ్యాంగ్ దోపిడీలకు పాల్పడింది. దేవలమ్మనాగారంలో సందీప్‌రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో బంగారం, 20వేల రూపాయలను దొంగతనం చేశారు. అక్కడి నుంచి కొయ్యలగూడెం వచ్చి ఒక ఇంట్లోకి చొరబడగా ఇంట్లో వారు మేల్కొనడంతో పారిపోయారు. పారిపోతూ అక్కడే కొన్ని మారణాయుధాలు వదిలివెళ్లారు. తెల్లవారుజామున జరిగిన దొంగతనాల విషయం తెలిసి నల్లగొండ పోలీసులు అలర్ట్ అయి హైవేపై మాటు వేశారు. ఈ క్రమంలో కొత్తగూడెం ఆటో ఎక్కిన ఇద్దరు దొంగలను అనుసరిస్తూ వెళ్లిన పోలీసు బృందం ఔటర్ రింగ్ రోడ్డు దాటగానే సంపూర్ణ హోటల్ ముందు ఆటో ఆగడంతో పోలీసులు చుట్టుముట్టి దొంగలను బంధించారు. వీరిని ఆ ఆటోలోనే నల్లగొండకు తీసుకువస్తున్న క్రమంలో పోలీసుల విచారణలో ఎరసానిగూడెం వద్ద లారీ డ్రైవర్ హత్యతో పాటు పెద్దకాపర్తి వద్ద కారులో నిద్రిస్తున్న వారి వద్ద దొంగతనం కూడా తామే చేసినట్లు ఒప్పుకున్నట్లు తెలిసింది. దాంతో ఇటీవల జరిగిన దొంగతనాలతోపాటు మిగతా గ్యాంగ్ సభ్యుల కోసం పోలీసులు విచారిస్తున్నారు. ట్టుబడిన దొంగలు పార్థీ గ్యాంగ్‌లోని షిండే వర్గానికి చెందిన వారుగా సమాచారం.

ఇండ్లు ఇవ్వకుండా అడ్డుకుంటే ఊరుకునేది లేదు

- సంకినేని వరుణ్‌రావు ఇంటిని ముట్టడించిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

సూర్యాపేటలో బీజేపీ నేత సంకినేని వరుణ్‌రావు ఇంటి వద్ద ఆందోళన చేస్తున్న డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు

బొడ్రాయిబజార్, జూలై 5 : రాజకీయ నాయకులు లబ్ధిదారులకు అండగా ఉండి ఇండ్లు ఇప్పించాలి గానీ అడ్డుకునే ప్రయత్నం చేసే ఊరుకునేది లేదని డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేటలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల్లో అనర్హులు ఉన్నారని, వాటిని రద్దు చేయిస్తామని బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి సంకినేని వరుణ్‌రావు వ్యాఖ్యలకు ఆందోళన చెందిన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులు శుక్రవారం వరుణ్‌రావు నివాసాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా డబుల్ బెడ్రూం లబ్ధిదారుల కమిటీ అధ్యక్షుడు షేక్ నయీమ్ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయించబడిన వారిలో 804మంది నిరుపేదలు ఉన్నారని, అందులో 54మంది దివ్యాంగులు ఉన్నారని తెలిపారు. అద్దె ఇండ్ల లో ఉంటూ కిరాయి కట్టేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. తను, తన భార్య దివ్యాంగులం కాగా ఇద్దరిలో ఒకరి పెన్షన్ కిరాయికే పోతుందని, నాలాంటి వాళ్లు చాలా మంది ఉన్నారని అన్నారు. కుటుంబ పెద్దలను కోల్పోయిన వారు కొందరున్నారని, వారికి ఇల్లు గడిచే పరిస్థితి లేదని చెప్పారు. 9నెలలుగా ఇండ్లు మంజూరైనా లబ్ధిదారులకు నేటికీ ఇవ్వలేదని, దీనిపై మాట్లాడని నాయకులు అర్హులకు కేటాయించిన ఇండ్లను రద్దు చేస్తామని మాట్లాడడం సరి కాదన్నారు. తమ కేటాయించిన ఇండ్లను ఎవరు ఆపినా వారి ఇండ్లను ముట్టడించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారుల కమిటీ సభ్యులు ఎండీ రఫీ, ఆర్.ఉపేందర్, డి.సైదులు, ఎస్‌కే ఆశ, యాకూబ్ పాషా, ఎండీ టిల్లు, మేగావత్ రవినాయక్, కమ్మలపల్లి నీలమ్మ, కాటూరి భిక్షమమ్మ, ఎస్‌కే నసీర్‌బాబా, గుండా వెంకన్న, పావని, ఎస్‌కే ఆయేషా, ఆండెం శారదతో లబ్ధిదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.